సాక్షి విజయనగరం

శనివారం। 14। జనవరి। 2023



పండగకు ఊరెళ్తున్నారా..!

పండగకు ఊరెళ్తున్నా... అయితే, తస్మాత్ జాగ్రత్త. ఇంటి అడ్రస్‌తో కూడిన వివరాలు మీకు దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తే నిఘా వేస్తారు. దొంగతనం జరగకుండా గస్తీ కాస్తారు. - IIలో



నాలుగు పూరిళ్లు దగ్ధం

సీతానగరం మండలం గూడెం వీధిలో శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. మరో మూడు పాక్షికంగా కాలిపోయాయి. - IIలో

16న స్పందన రద్దు



విజయనగరం అర్బన్: కనుమ సందర్భంగా ఈ నెల 16న జరగాల్సిన స్పందన వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఫిర్యాదుదారుల ఈ విషయాన్ని గమనించాలని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు: మంత్రి బొత్స



విజయనగరం అర్బన్: పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ కలిసి చేసుకునే అతిపెద్ద తెలుగు పండగ సంక్రాంతి... ఈ పండగ ప్రతి ఇంటా వెలుగులు నింపాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు శుక్రవారం ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు సంప్రదాయాలు ఉట్టిపడేలా డూడూ బసవన్నల కోలాహలం, బంధువుల సందడి నడుమ పండగను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు.

జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు సునీత



జాతీయస్థాయి రోప్‌స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న అధ్యాపక సిబ్బంది

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి ఎస్‌డీఎస్ డిగ్రీ కళాశాలలో బీకామ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఐ.సునీత జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 11న జరిగిన యూనివర్సిటీ స్థాయి పోటీల్లో రాణించింది. ఈ నెల 22న బోపాల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తలపడనుంది. విద్యార్థినిని కళాశాల సెక్రటరీ టి.కమలాకర్, ప్రిన్సిపాల్ డా.ప్రసన్నలక్ష్మి, ఎం.భాస్కరరావు, పీడీలు బి.శ్రీనివాసరావు, ఎం.భానుమూర్తి అభినందించారు.

లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ



గంట్యాడ మండలంలో రైస్ మిల్లు వద్ద ధాన్యం దించుతున్న కలాసీలు

విజయనగరం ఫోర్ట్: విజయనగరం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ లక్ష్యం మేరకు పూర్తి చేసినట్టు జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి త్రినాథస్వామి శుక్రవారం తెలిపారు. ఎటువంటి అవకతవకలకు తావులేకుండా రైతులు నుంచి ధాన్యం సేకరించామని చెప్పారు. ధాన్యం సేకరణ లక్ష్యం 2.64 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణను శుక్రవారం నాటికి పూర్తిచేశామన్నారు. ధాన్యం విక్రయించిన 21 రోజులలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తున్నట్టు వెల్లడించారు. సంక్రాంతి తర్వాత ధాన్యం సేకరణ లక్ష్యం పెంచే అవకాశం ఉందన్నారు.

దేవదాయశాఖ ఇన్‌చార్జి ఏసీగా సుధారాణి



విజయనగరంటౌన్: దేవదాయశాఖ జిల్లా ఇన్‌చార్జి సహాయ కమిషనర్‌గా కె.ఎల్. సుధారాణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం దేవదాయశాఖలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె పార్వతీపురం మన్యం జిల్లా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. విధుల్లో అలసత్వం వహించినందుకు ఇప్పటివరకూ ఇక్కడ ఏసీగా పనిచేసిన వినోద్ కుమార్‌ను సస్పెండ్ చేశారు.

శిల్పారామంలో.. సంక్రాంతి శోభ

- తెలుగువారి సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు
- సంప్రదాయ వస్త్రధారణలో హాజరైన అధికారులు
- ఉత్సాహంగా సాగిన వివిధ పోటీలు
- విజేతలకు బహుమతుల ప్రదానం



వాలుజడతో సంప్రదాయ వస్త్రధారణలో యువతి



హరిదాసు



చిన్నారుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్:

భోగి మంటలు.. హరిదాసు కీర్తనలు.. గాలి పటాలతో చిన్నారుల కేరింతలు.. మహిళల కోలాట ప్రదర్శనలు.. డూడూ బసవన్నల విన్యాసాలు.. ప్రజాప్రతినిధులు, అధికారుల సంప్రదాయ వస్త్రధారణలతో శుక్రవారం శిల్పారామం సంక్రాంతి శోభను సంతరించుకుంది. ఉదయం నుంచి రాత్రి వరకూ నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ తెలుగువారి అతిపెద్ద పండగ సంక్రాంతిని సందడిగా జరుపుకోవాలని జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. రైతుల కష్టఫలం ఇంటికిచేరే రోజున సంక్రాంతి పండగను తెలుగువారు అత్యంత ఘనంగా నిర్వహించుకుంటారన్నారు. రైతు బాగుంటేనే సమాజం బాగుంటుందన్నది సంక్రాంతి పండగ చాటి చెబుతోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ జిల్లా అభివృద్ధికి కృషిచేయడం ఆనందంగా ఉందన్నారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగువారు ప్రపంచంలో ఏమూలనున్నా అత్యంత ఘనంగా నిర్వహించుకునే మహోన్నతమైన పండగ సంక్రాంతి అని పేర్కొన్నారు. గత 15 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పంటలు బాగా పండి, రికార్డు స్థాయిలో దిగుబడులు వచ్చాయని, రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. విత్తు నుంచి ఉత్పత్తి వరకు అన్నింట్లో ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుండంతో రైతులకు సాగు కలిసివస్తోందన్నారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ అన్నదాత సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది పంటలు బాగా పండాయని, నదులు జలకళతో కళకళలాడుతున్నాయన్నారు. ప్రజలంతా రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆనందం వెల్లివిరియాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్ బాబు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జేసీ కె.మయూర్‌అశోక్, ఆర్డీఓ ఎం.వి.సూర్యకళ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



భోగి మంటను వెలిగిస్తున్న డిప్యూటీ స్పీకర్, జెడ్పీచైర్మన్, అధికారులు, ప్రజాప్రతినిధులు



హరిదాసుకు దక్షిణ వేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఉన్నతాధికారులు తమ హోదాను పక్కన పెట్టి సంబరాల్లో ఆడి, పాడి అలరించారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధికారి బి.శాంతకుమారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మలత, ఏపీఎం సులోచన, ఐసీడీఎస్ ఉద్యోగి సుభాషిణి పాటలు శ్రావ్యంగా ఆలపించి ఆకట్టుకున్నారు. మరో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుదర్శన దొర కర్రసాము చేశారు. మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల విద్యార్థులు సంక్రాంతి నృత్యరూపకాలతో ముగ్దులను చేశారు. రంగవల్లుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన సులోచన, ప్రవీణ, జ్యోత్స్నతోపాటు పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ, వంటల పోటీల్లో విజేతలైన రమణమ్మ, దుర్గ, నాగమణిలకు అధికారులు బహుమతులు అందజేశారు.



గంగిరెద్దు విన్యాసం...

ఉత్సాహంగా సాగిన గాత్ర కచేరీలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా శిల్పారామంలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మహారాజా సంగీత, నృత్యకళాశాల, అమృత వర్షిణి సంస్థ విద్యార్థులు నిర్వహించిన సంగీత గాత్ర కచేరీలు, నాట్య విన్యాసాలు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, రెవెన్యూ అధికారి గణపతిరావులు పాల్గొని కళాకారులను అభినందించి, విజేతలకు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, భావన, తదితరులు

భోగి మార్కెట్



సంక్రాంతి పండగ మూడు రోజులకు సరిపడా సరుకుల కొనుగోలుదారులతో విజయనగరంలోని మార్కెట్‌లు రద్దీగా మారాయి. జనజాతరను తలపించాయి. వస్త్రాలు, పిండివంటలు, పూజా సామగ్రి విక్రయించే దుకాణాలు కిటకిటలాడాయి. నగరంలోని మెయిన్‌రోడ్, ఉల్లివీధి, రామానాయుడు రోడ్, గూడ్స్‌షెడ్ రోడ్, డాబాగార్డెన్స్, రైల్వేస్టేషన్ రోడ్, స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచి, ఆర్టీసీ కాంప్లెక్స్, కోట కూడళ్లు జనంతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్ స్తంభించింది. వస్త్ర వ్యాపారానికి తలమానికంగా నిలిచే విజయనగరంలో శుక్రవారం ఒక్కరోజు రూ.5 కోట్లకు పైగా వ్యాపారం జరిగినట్టు మార్కెట్ వర్గాల అంచనా. అలాగే, పండగలో పిండివంటకాల కోసం అవసరమైన నిత్యావసరాల కొనుగోళ్లు మరో రూ.3 కోట్ల వరకు సాగినట్టు సమాచారం.

– విజయనగరం

కూచిపూడి నృత్యంలో దీప్షిక ప్రతిభ

చీపురుపల్లి: ఆన్‌లైన్‌లో జరిగిన ఇండియన్ క్లాసికల్ డ్యాన్స్ పోటీల్లో చీపురుపల్లి పట్టణానికి చెందిన కెల్ల దీప్షిక కూచిపూడి నృత్య విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచింది. దీంతో ఆమెకు అవార్డుతో పాటు ధ్రువీకరణపత్రాన్ని నిర్వాహకులు అందజేశారు. వరంగల్‌లోని హర్ష నృత్యాలయ నేతృత్వంలో గత ఏడాది డిసెంబర్ 5న అంతర్జాతీయ స్థాయి క్లాసికల్ డ్యాన్స్ ఫెస్టివల్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. చీపురుపల్లిలోని విజయకాలనీకు చెందిన దీప్షిక కూచిపూడి నృత్యం వీడియో రికార్డింగ్‌ను ఆన్‌లైన్‌లో పంపించారు. ఆమె నృత్య ప్రదర్శనకు అవార్డు రావడంతో తల్లిదండ్రులు హేమలత, గోపీకృష్ణ, స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.



అవార్డు, ధ్రువీకరణ పత్రంతో కెల్ల దీప్షిక

టోల్ ఫ్రీ నంబర్–1967కు కాల్‌చేయండి

- పారదర్శకంగా ఉచిత బియ్యం పంపిణీ
- జేసీ మయూర్‌అశోక్



విజయనగరం అర్బన్: రేషన్ బియ్యం పంపిణీలో అవకతవకలు జరిగినా, ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్‌అశోక్ కోరారు. ప్రజల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నంబర్ 1967ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో బియ్యం పంపిణీలో లేదా ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు ఉన్నా, తూనికలు, కొలతల విషయంలో లోపాలు తలెత్తినా ఫిర్యాదు చేయొచ్చన్నారు. వినియోగదారుల సంరక్షణ చట్టం–2019 ప్రకారం సమస్యలు పరిష్కరించి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



భలే డిమాండ్

సాధారణంగా ఉల్లిగడ్డలకు ధర ఎక్కువ ఉంటుంది. ఇప్పుడు ఉల్లిగడ్డల కంటే కాడల ధర రెండింతలు పలుకుతుండడం అందరినీ ఆశ్చర్యం కలిగిస్తోంది. గతంలో ఉల్లికాడలను రైతులు కోసేవారు కాదు. ఊరిలో ఇరుగుపొరుగువారికి ఉచితంగానే ఇచ్చేవారు. ఇప్పుడు ధర పెరగడంతో రామభద్రపురం అంతర రాష్ట్రమార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. మార్కెట్‌లో కిలో నాటు ఉల్లిపాయల ధర రూ.16 నుంచి రూ.20 ఉండగా, కిలో కాడల ధర రూ.40 నుంచి రూ.50 పలుకుతోంది.

– రామభద్రపురం

ఓటు అడిగేహక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది

- యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే..
- రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్న వారిపై దూషణలను ప్రజలు హర్షించరు
- రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం తెలుసుకుని మాట్లాడాలి
- యువశక్తి సభలో పవన్‌కల్యాణ్ మాట్లాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నాం
- జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు సంక్రాంతి శుభాకాంక్షలు
- జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు



మీడియాతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం: రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీకి అన్నివర్గాల ప్రజలను ధైర్యంగా ఓటు అడిగే హక్కు ఉందని జెడ్పీచైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానిదేనన్నారు. లక్షలాదిమంది యువతకు ఉద్యోగాలు కల్పించినది ఎవరో నిరుద్యోగులకు బాగా తెలుసన్నారు. ఒంటరిగా పోటీచేసినా, పొత్తులు పెట్టుకున్నా 2024 ఎన్నికల్లో జనసేనకు ఓటమి తప్పదన్నారు. ఈ విషయం పార్టీ అధ్యక్షుడికి బాగాతెలుసని, అందుకే పార్టీ కార్యకర్తలను మభ్యపెట్టేందుకు పదేపదే ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నారన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెడ్పీచైర్మన్ మాట్లాడారు. ముందుగా జిల్లా ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వ్యక్తిగతంగా పోటీచేసే శక్తిలేక జనసేన పార్టీ పొత్తులు పెట్టుకుంటోందని విమర్శించారు. పేదలకు పథకాలు అందకుండా ఎన్ని అడ్డంకులు సృష్టించినా సంక్షేమపాలనను సాగిస్తున్నామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.4శాతం అమలు చేసిన వైఎస్సార్‌సీపీ 2024 ఎన్నికల్లో గెలుపు ఖాయమన్నారు. యువత చదువు, ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.

ఆ భాష సరిగా లేదు...

పవన్ కల్యాణ్ యువశక్తి పేరిట ఇటీవల లావేరులో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన భాషను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా 151 అసెంబ్లీ సీట్లు సాధించుకుని ముఖ్యమంత్రిగా ఎన్నికైన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని సంబోధించే తీరు సరిగాలేదన్నారు. ఓ పార్టీ అధ్యక్షుడిగా రాజ్యాంగం, ప్రజాస్వామ్యానికి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఏమి చేస్తామన్న మేనిఫెస్టోను బాధ్యతగా తెలియజేయాలే తప్ప, వ్యక్తిగత విమర్శలు తగవన్నారు. ఒకే సారి లక్షల ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వాన్ని అభినందించాల్సిందిన బాధ్యత పవన్‌కల్యాణ్‌పై లేదా అంటూ ప్రశ్నించారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి సుమారు 2లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పించిన విషయం పవన్‌కు తెలియకపోవడం విచారకరమన్నారు. 2.50 లక్షల మందికి వలంటీర్‌లుగా అవకాశం కల్పించి నెలకు రూ.5వేలు గౌరవ భృతిచెల్లిస్తున్నది కనిపించడంలేదా అంటూ ప్రశ్నించారు. వైద్య, పోలీస్ శాఖల్లో ఉద్యోగాల భర్తీ సంగతిని పవన్ మర్చిపోయారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఒక్క కరువు మండలం కూడా లేదన్న విషయాన్ని తెలుసుకోవాలన్నారు. కరోనా కష్టకాలంలో మొక్కజొన్న పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకున్నామన్నారు. వలసలు నివారించి ఉన్న ఊరిలో ఉపాధి కల్పించడంలో దేశంలోనే విజయనగరం జిల్లా ప్రథమ స్థానంలో ఉందని గుర్తు చేశారు.

పవన్‌ది రాజకీయ వ్యభిచారం

- బీజేపీతో ప్రయాణం చేస్తూ టీడీపీతో జత కట్టడం సిగ్గు చేటు
- అరాచకాన్ని ప్రోత్సహించేలా మాట్లాడడం దారుణం
- సినిమా డైలాగుల చెబితే చప్పట్లు తప్ప ఓట్లు రావు
- 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం
- రాష్ట్రంలో చంద్రబాబుకు ఓట్లు అడిగే హక్కు లేదు
- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



మీడియాతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ రాజకీయ వ్యభిచారం చేస్తున్నారని ఏపీ శాసన సభా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఎద్దేవాచేశారు. బీజేపీతో కలిసి రాజకీయ ప్రయాణం సాగిస్తామని చెప్పి మధ్యలో టీడీపీతో జతకట్టడం సిగ్గుచేటన్నారు. తన నివాసంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోలగట్ల మాట్లాడారు. ఒంటరిగా పోటీ చేసే ధైర్యంలేని జనసేన పార్టీ టీడీపీతో కలిసి ఐక్యతారాగం పాడుతోందన్నారు. టీడీపీ, జనసేన పొత్తుతో వైఎస్సార్‌సీపీకి ఒరిగిందేమీ లేదన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమన్నారు. ఓ పార్టీ అధ్యక్షునిగా హుందాతనం ప్రదర్శించాలే తప్ప యువతను రెచ్చగొట్టి పరోక్షంగా అరాచకాలను ప్రోత్సహించేలా మాట్లాడడం పవన్‌కల్యాణ్‌కు తగదన్నారు. మేము తిడతాం... పరిగెత్తించి కొడతాం... అంటూ నాలుగు సినిమా డైలాగులు చెబితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మూడు ముక్కలాడుతున్నారంటూ మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్... రాష్ట్ర విభజన సమయంలో బీజేపీ, టీడీపీలు రెండు ముక్కలాడాయని, అప్పుడు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. పవన్ కల్యాణ్ నాయకత్వాన్ని నమ్మలేకనే 2019 ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున గెలిచిన ఒక్క ఎమ్మెల్యే కూడా జనసేన పార్టీకి దూరంగా ఉంటున్నారన్నారు. వరుసగా జరుగుతున్న అవమానాలకు సిగ్గుతో తలదించుకోవాల్సింది పోయి... మర్చిపోయినట్లు నటించడం పవన్‌కల్యాణ్‌కే చెల్లుతుందన్నారు. నా సభలకు వచ్చిన యువత ఓట్లు వేయడం లేదంటూ బహిరంగ సభలో చెప్పుకోవడం జనసేన పార్టీపై ఆయనకున్న నమ్మకాన్ని తేటతెల్లంచేస్తోందన్నారు.

ప్రజల ప్రాణాలంటే లెక్కలేదా...?

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ప్రజల ప్రాణాలంటే లెక్కలేదని కోలగట్ల వాఖ్యానించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు నిర్వహించిన సభలో 11 మంది చనిపోతే వారికి కనీసం నివాళులర్పించాలన్న మానవీయత లేకపోవడం పవన్‌రాజకీయ అపరిపక్వతకు అద్దంపడుతోందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ప్రభుత్వంతో పోరాటం చేశామని చెప్పుకున్న పవన్ ఏం సాధించారని, ప్రజారాజ్యం పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేయడమేనా సాధించిన ఘనత అంటూ వాఖ్యానించారు. రాష్ట్రంలో వెదవలు, సన్యాసులు ఎవరన్నది ప్రజలందరికీ తెలుసన్న విషయాన్ని గ్రహించాలన్నారు. రాష్ట్రంలో ప్రజలను ఓట్లు అడిగే హక్కు చంద్రబాబుకు లేదన్నారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్‌లో ఇల్లు లేదని, ఇక్కడ గెలవలేమన్న భయంతో తెలంగాణలో సభలు పెట్టుకుంటున్నారన్నారు. ప్రశ్నించేందుకు ఏమి లేక ప్రభుత్వంపై ఉన్నవి లేనట్లు.. లేనివి ఉన్నట్టు వక్రీకరణలు చేస్తూ తమ అనుకూల మీడియాతో విష ప్రచారం చేస్తున్నారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, రానున్న ఎన్నికల్లో 175 సీట్లలో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

క్లుప్తంగా

ఆటో, బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలస గ్రామసమీపంలోని కాలువ వద్ద ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీ కొట్టడంతో ఇద్దరు వ్యక్తులు గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. తురకనాయుడువలస గ్రామానికి చెందిన తమరాడ శ్రీనివాసరావుకు, ఇత్తిలి శ్రీనులు శుక్రవారం బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టగా కింద పడిన వారిద్దరి కాళ్లూ చేతులకు బలమైన గాయాలయ్యాయి. ఈ మేరకు క్షతగాత్రులను 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

పదోన్నతులు కల్పించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత పేరుతో ఎటువంటి నియమ నిబంధనలు పాటించకుండా చేస్తున్న పనిసర్దుబాటును తక్షణం రద్దు చేయాలి. గతంలో చేసిన ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఫ్యాప్టో కార్యవర్గం డిమాండ్ చేసింది. ఫ్యాప్టో ఆధ్వర్యంలో శుక్రవారం డీఈఓ బి లింగేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి శ్యామ్, రమేష్ చంద్రపట్నాయక్, డి ఈశ్వరరావు, పి.శ్రీనివాసరావు, టి సన్యాసిరాజు, బుకారీ బాబు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ


● డీఈఓ ఎస్‌డీవీ రమణ

పార్వతీపురం టౌన్: దివ్యాంగ విద్యార్థులకు ఉచిత ఉపకరణాల పంపిణీ కార్యక్రమం శనివారం స్థానిక ఆర్‌సీఎం పాఠశాల ప్రాంగణం వద్ద నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌డీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్రశిక్ష, ఎస్‌బిఈపీబిడీ నెల్లూరు వారి సహకారంతో ఉపకరణాల పంపిణీ చేపట్టనున్నట్లు చెప్పారు. మొత్తం 490 ఉపకరణాలను దివ్యాంగులకు అందజేయనున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు, కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు.

డైట్ కళాశాల సీనియర్ అసిస్టెంట్ ఆత్మహత్య

గంట్యాడ: మండలంలోని కరకవలసలో గల ప్రేమ రెసిడెన్సీలో నివాసం ఉంటూ నెల్లిమర్ల డైట్ కళాశాలలో సీనియర్ అసిస్టెంట్ పనిచేస్తున్న అవనాపు సతీష్ గురువారం రాత్రి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి శుక్రవారం తరలించారు. వివాహం జరిగి 18 ఏళ్లయినా పిల్లలు లేక పోవడం, ఆస్తి విషయంలో తగాదాలు ఉండడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు చెప్పారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్యా యత్నం



చికిత్సపొందుతున్న సింహాచలం

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలం మరువాడ గ్రామానికి చెందిన ఆరిక సింహాచలం పురుగు మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. ఇందుకు సంబంధించి ఆయన మేనమామ బిడ్డిక గౌరన్న దొర ఇచ్చిన సమాచారం మేరకు పార్వతీపురం జిల్లా ఆస్పత్రి ఔట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేశారు. మద్యానికి అలవాటు పడిన సింహాచలం వ్యక్తిగత కారణాలతో మనస్తాపం చెంది పురుగు మందు తాగేసినట్లు భావిస్తున్నామని ఫిర్యాదు దారు పేర్కొన్నాడు, సింహాచలం పురుగు మందు తాగిన విషయం గమనించి 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందజేశారు. ఫిర్యాదు మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹220	₹ 230

పండగకు ఊరెళ్తున్నారా..!

- పోలీసులకు సమాచారం తప్పనిసరి
- ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోండి
- నిరంతర పోలీస్ పర్యవేక్షణతో ఇంటికి పూర్తిస్థాయి భద్రత

విజయనగరం క్రైమ్:

సంక్రాంతి పండగకు ఊరెళ్తున్న వారందరికీ పోలీస్ వారి విజ్ఞప్తి. సొంతూళ్లకు, అత్తవారిళ్లకు వెళ్లే వారంతా తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిందేనని సూచిస్తున్నారు. ఏ మాత్రం ఆదమరిచినా దొంగలు ఇల్లు గుల్ల చేసే ఆస్కారం ఉన్నందున ప్రతి ఒక్కరూ స్వీయజాగ్రత్తలతో పాటు కనీస సమాచారాన్ని సమీప పోలీస్‌స్టేషన్‌లో అందించాలని హితవు చెబుతున్నారు. నాలుగైదు రోజుల పాటు ఇళ్లను వదిలి వెళ్లే వారంతా తప్పనిసరిగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు. ఇందుకోసం జిల్లా పోలీసు యంత్రాంగం అడుగడుగునా మైక్‌ల ద్వారా కాలనీల్లోనూ, బహిరంగ ప్రదేశాల్లో అనౌన్స్ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

ఇంట్లో విలువైన వస్తువులు ఏమైనా ఉంటే సమీప బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం తప్పనిసరి. ఇటీవల తాళాలు వేసిన ఇళ్లతో పాటు మనుషులు ఉన్న ఇళ్లల్లోనూ దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇక శివారు ప్రాంతాలైతే అత్యంత జాగ్రత్తగా ఉండాల్సిందే. ఇంటికి తాళాలు వేస్తే ఆండ్రాయిడ్ మొబైల్‌లో పోలీసులు రూపొందించిన ఎల్‌హెచ్‌ఎంఎస్ అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకుని సమాచారమందించండి. పోలీసులు మీ ఇంటికి భద్రత కల్పిస్తారు. ఊర్లో ఉన్న బంధువులకు కూడా సమాచారమివ్వాలని చెబుతున్నారు.

యాప్ వినియోగంతో పోలీస్ సహాయం

ఎల్‌హెచ్‌ఎంఎస్ (లాక్డ్ హౌస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ఒక ఆండ్రాయిడ్ యాప్. దీని ద్వారా ఇంటికి రక్షణగా పోలీస్ సహాయం సులభంగా తీసుకోవచ్చు. చిన్న మెసెజ్ పెట్టడం వల్ల మీరు ఇంట్లో లేనప్పుడు మీ ఇంటిని సురక్షితంగా చూసే బాధ్యతను పోలీసులు తీసుకుంటారు. ఈ యాప్‌పై అవగాహన లేకపోవడం వల్ల ప్రజలు పెద్దగా స్పందించడం లేదు. వన్‌టౌన్ పరిధిలో 16, టూటౌన్ పరిధిలో 14, నెల్లిమర్ల మూడు, బొబ్బిలి 10, సాలూరు 5, పార్వతీపురం పరిధిలో 10 మొత్తం 58 సీసీ కెమెరాలను ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ కోసం ప్రత్యేకంగా సిద్ధంగా ఉంచారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో ఇప్పటివరకూ జిల్లాలో సుమారు 14 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇప్పటివరకూ 450 మంది వారు ఇళ్లల్లో లేని సమయాల్లో యాప్‌ను సద్వినియోగం చేసుకుని ఇళ్లకు భద్రత పెంచుకున్నారు. యాప్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా పట్టువదలని విక్రమార్కుల్లా పోలీసులు ప్రయత్నిస్తూనే ఉన్నారు.



ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్

మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయడం ఇలా..

స్మార్ట్ ఫోన్‌లో గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ ఏపీ పోలీస్ అని టైప్ చేయాలి. ఏపీ పోలీస్ పేరిట అప్లికేషన్ కనిపిస్తుంది. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. తర్వాత వ్యక్తిపేరు, ఫోన్ నంబర్, చిరునామాతో పాటు ఇంట్లో కూర్చుని గూగుల్ మ్యాప్‌ను అటాచ్ చేయాలి. వెంటనే మనమిచ్చిన ఫోన్ నంబర్‌కు వన్‌టైమ్ పాస్‌వర్డ్ వస్తుంది. దాన్ని యాప్‌లో టైప్ చేస్తే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత మన ఫోన్‌కు రిజిస్ట్రేషన్ నంబర్ వస్తుంది. దీన్ని ఎక్కడైనా భద్రపరుచుకోవాలి. ఇక ఎప్పుడైనా, ఎక్కడికైనా ఊరికి వెళ్తున్నప్పుడు పోలీసులు ఇంటిపై నిఘా ఉంచాలనుకుంటే యాప్‌లోకి వెళ్లి 'రిక్వెస్ట్ పోలీసు వాచ్' ఆప్షన్ ఎంచుకోవాలి. అలా చేసిన తర్వాత యూజర్ ఐడీ అడుగుతుంది. గతంలో సెల్‌ఫోన్‌కి వచ్చిన రిజిస్ట్రేషన్ సంఖ్యను టైప్ చేయాలి. మనం ఎప్పుడు ఊరికి వెళ్తున్నాం. సమయం, తిరిగి వచ్చే తేదీ, సమయం టైప్ చేసి సబ్ మిట్ చేసి వాచ్ రిక్వెస్ట్‌పై క్లిక్ చేయాలి.

పనితీరు ఇలా..

సబ్‌మిట్ వాచ్ రిక్వెస్ట్ పూర్తయిన తర్వాత ఇంటికి పోలీస్ కానిస్టేబుల్ వస్తారు. ఇంట్లో ఆలౌట్ మిషన్‌ను పోలి ఉండే ఓ మోషన్ కెమెరాను బిగించిన తర్వాత మనం ఇంటికి తాళం వేసుకుని వెళ్లిపోవచ్చు. అప్పటి వరకూ కెమెరా పనిచేయదు. ఎప్పుడైతే దొంగలోనికి ప్రవేశిస్తాడో ఆ కదలికల ద్వారా కెమెరా ఆన్ అవుతుంది. ఒక్కసారి కెమెరా ఆన్‌కాగానే జిల్లా ఎస్పీకి, కమాండ్ కంట్రోల్ గదిలో అనుసంధానం చేసిన టీవీలోకి లైవ్ ప్రత్యక్ష్యమవుతుంది. అలారం ద్వారా బ్లూకోట్ పోలీసుల నుంచి ఎస్పీ వరకూ అలెర్ట్ చేస్తుంది. ఇక నేరుగా పోలీసులు వచ్చి దొంగను పట్టుకెళ్తారు. అయితే ఊరికి వెళ్తున్న సమయంలో సమీప పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా సమాచారం అందించాలి. రాత్రి గస్తీ నిర్వహించే పోలీసులు మీరిచ్చే రిపోర్ట్ ఆధారంగా తప్పనిసరిగా అటువైపు వెళ్లి పరిశీలిస్తుంటారు.

ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ ద్వారా ప్రత్యక్ష పర్యవేక్షణ



పోలీస్ కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానమై ఎల్‌హెచ్‌ఎమ్ఎస్ యాప్ పనిచేస్తుంది. పండగకి ఊర్లెళ్లే వారంతా ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి. సీసీ కెమెరాలతో పాటూ ప్రత్యేక బందోబస్తు పర్యవేక్షిస్తుంటుంది. విలువైన వస్తువులను ఇంటిలో ఉంచుకోవద్దు. అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పండగకు దూరప్రాంతాలకు వెళ్లే ప్రజలు సమీప పోలీస్‌స్టేషన్‌లో సమాచారమివ్వాలి. ప్రత్యేక బృందాలు ఆయా ప్రాంతాల్లో గస్తీ నిర్వహిస్తారు.

-ఎం.దీపిక, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, విజయనగరం

ధనాధన్ టోర్నీకి వేళాయె..

సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీకి ఎంట్రీల ఆహ్వానం

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్‌రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్-19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్-25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజనీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు 9951602843, 8121703348.

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

రిమాండ్ ఖైదీ పరారీ

రాజాం సిటీ: పాలకొండ సబ్ జైలు రిమాండ్ ఖైదీ పున్నాన రాంబాబు పరారైనట్లు పోలీసు వర్గాలు శుక్రవారం తెలిపాయి.విజయనగరం వన్‌టౌన్ పోలీసుస్టేషన్ కేసుకు సంబంధించి రిమాండ్ ఖైదీని విజయనగరం ఏఆర్ సిబ్బంది ఈ నెల 12న కోర్టుకు తీసుకువెళ్లారు. తిరిగి పాలకొండ సబ్‌జైలుకు అప్పగించేందుకు ఆర్టీసీ బస్సులో తీసుకు వస్తుండగా రాజాం బస్టాండ్ వద్ద ఖైదీ తప్పించుకుని పారిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. ఖైదీకి ఎస్కార్ట్‌గా వచ్చిన విజయనగరం ఏఆర్ హెచ్‌సీ బి.శంకరరావు రాజాం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు టౌన్ సీఐ కె.రవికుమార్ తెలిపారు.



పరారీలో ఉన్న రిమాండ్ ఖైదీ రాంబాబు

వరికుప్పలకు నిప్పుపెట్టిన దుండగులు

- రూ.1.5 లక్షల నష్టం

వీరఘట్టం: ఆరుగాలం కష్టపడి రైతు పండించిన వరిచేనును గుర్తు తెలియని వ్యక్తులు కాల్చివేయడంతో ఆ రైతుకు సుమారు రూ.1.50 లక్షల నష్టం జరిగింది. ఈ సంఘటనపై స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయినగర్ కాలనీకి చెందిన రైతు ఆలుబిల్లి మజ్జీశ్వరరావు తాను పండించిన రెండు ఎకరాల్లోని వరి చేనును క్రరల మిల్లు సమీపంలో ఉన్న వైర్ల ఫ్యాక్టరీ ఆవరణలో కుప్పలు పెట్టాడు. సంక్రాంతి నండగ తర్వాత నూర్పు చేసి ధాన్యం విక్రయించాలనుకున్నాడు. అయితే శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు ఆ కుప్పలకు నిప్పు పెట్టడంతో ధాన్యం కుప్పలు అగ్నికి ఆహుతై బూడిద మిగిలింది. సంఘటనా స్థలం వద్ద ప్రమాదాన్ని పరిశీలిస్తే వరిచేను కుప్పలను కావాలనే ఎవరో కాల్చేసినట్లు ఆధారాలు స్పష్టంగా కనిపించాయి.దీంతో గుర్తు తెలియని వ్యక్తులు తన వరిచేను కుప్పలు కాల్చేసినట్టు బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై ఎం.హరికృష్ణ కేసు నమోదు చేశారు. అంతకు ముందు పాలకొండ ఫైర్ సిబ్బందికి ఇక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు.



వీరఘట్టంలో బూడిదైన రెండెకరాల వరిచేను

రెడ్‌క్రాస్ సొసైటీకి గరివిడి వాసి అప్పగింత



వృద్ధుడిని రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించిన సురేష్‌రెడ్డి, పవన్

తగరపువలస: అంధుడైన 70 ఏళ్ల వృద్ధుడు శీరపు లక్ష్మీనారాయణ రెండు రోజులుగా చిట్టివలసలోని సప్తగిరి థియేటర్ వద్ద రోడ్డుపై పడి ఉన్నాడు. స్థానికులు ఇచ్చింది తింటూ బయట చలిలోనే వణుకుతూ పడుకుంటున్నాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆరా తీయగా..తనది విజయనగరం జిల్లా గరివిడి అని, అత్తవారిది తగరపువలస అని చెప్పాడు. భార్య పేరు రాధ, రెండో కుమారుడి పేరు కూర్మ అని తెలియజేశాడు. మిగతా వివరాలు చెప్పలేకపోతున్నాడు. ఆయనకు వినిపించడం లేదని స్థానికులు తెలిపారు. దీంతో సంతపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నీలాపు సురేష్‌రెడ్డి, కుమ్మరవీధికి చెందిన ఫార్మా ఉద్యోగి పొట్నూరు పవన్‌లే కారులో ఆయనను తీసుకువెళ్లి పెదవాల్తేరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అప్పగించారు. వృద్ధుని కుటుంబసభ్యులు ఎవరైనా ఉంటే సొసైటీలో సంప్రదించాలని కోరారు.

విలేకరిపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా ప్రధానకార్యదర్శి సూర్యనారాయణ

బాడంగి: మండలానికి చెందిన ఒకదినపత్రిక (సాక్షికాదు) విలేకరి అక్రమవసూళ్లు, అప్పుల రూపంలో నగదు వసూలు చేస్తూ..అడిగితే పత్రిక పేరుతో బెదిరిస్తున్నాడని కావున ఆ విలేకరిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఎరుకుల పాకలు గ్రామంలో ఎంపీటీసీ పాలవలస గౌరు సమక్షంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలియజేశారు. గ్రామంలో గతంలో కరెంటు సమస్యలకు కారణం ఆ విలేకరే అని తెలిసిందని తాముకల్పించుకొని పోరాడితే అధికారులు స్పందించి విద్యుత్‌సరఫరా పునరుద్ధరించారని చెప్పారు. వలంటీర్ పోస్టు వేయిస్తానని రూ.50వేలు, అప్పుగా రూ.50వేలు ఎంపీటీసీ గౌరువద్ద తీసుకున్నట్లు చెప్పారు. అలాగే పలువురు వ్యక్తులు, ఉద్యోగుల వద్ద కూడా డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వకపోగా బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎంపీటీసీ గౌరు పోలీసులకిచ్చిన ఫిర్యాదుపై కేసునమోదు చేసి దర్యాప్తుచేసి బాధితులకు న్యాయంచేయాలని కోరారు. ఆ దినపత్రిక యాజమాన్యం పట్టించుకుని చర్యలు చేపట్టాలని లేదంటే ఆయన దందాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆయనతో పాటు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పి.శంకరరావు, బాడంగి, తెర్లాం, రామభద్రపురం మండలాల ప్రతినిధులు సురేష్, గోపాలం, శ్రీనివాసరావు, రైతుకూలీ సంఘం నాయకుడు ఉడమలప్రసాద్, బాధిత ఎంపీటీసీ పాలవలస గౌరు పాల్గొన్నారు.

సత్య కళాశాల విద్యార్థినికి బంగారు, రజత పతకాలు



పల్లవిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: స్థానిక తోటపాలెంలో ఉన్న సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఎస్.పల్లవి జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ జూనియర్, సీనియర్ చాంపియన్‌షిప్‌లో బంగారు, రజత పతకాలు గెలుచుకున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో విద్యార్థినిని శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలోని నాగర్ కోయిల్‌లో డిసెంబర్ 28 నుంచి జనవరి 7వరకూ నిర్వహించిన పోటీల్లో పల్లవి అద్భుతమైన ప్రతిభ చూపించి పతకాలు గెలుచుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.సాయి దేవమణి, ఫిజికల్ డైరెక్టర్ మహేష్, కోచ్ చల్లా రాము, విద్యార్థులు ఆమెను అభినందించారు.

నాలుగు పూరిళ్లు దగ్ధం



మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సీతానగరం: మండల కేంద్రంలోని గూడెం వీధిలో శుక్రవారం అకస్మాత్తుగా సంభవించిన అగ్ని ప్రమాదంలో యానాది కులస్తులకు చెందిన నాలుగు పూరిళ్లు దగ్ధమయ్యాయి. మరో మూడిళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో ఆ కుటుంబాలు నిలువ నీడలేక రోడ్డున పడ్డాయి. ఈ ప్రమాదంలో చెరుకుబిల్లి అప్పలనర్సమ్మ, గంగయ్య, కవితమ్మ, నరేష్‌లకు చెందిన పూరిళ్లు పూర్తిగా కాలిపోవడంతో పాటు ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, పండగ బట్టలు, నగదు బూడిదై లక్షలాది రూపాయల ఆస్తినష్టం వాటిల్లిందని భోరున విలపించారు. అగ్ని ప్రమాదాన్ని నివారించడానికి స్థానికులు కొంత మేరకు మంటలను అదుపుచేశారు. సమాచారం మేరకు బొబ్బిలి అగ్ని మాపక కేంద్రం సిబ్బంది వచ్చి సిబ్బంది మంటలు అదుపు చేశారు. అగ్నిప్రమాదం జరిగిన ఇళ్లలో రెండు వంటగ్యాస్ సిలిండర్లు పేలి పోవడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఎంటువంటి ప్రాణ నష్టం వాటిల్లక పోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సంఘటనా స్థలానికి వచ్చిన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, తహసీల్దార్ ఎన్వీ రమణ, ఎస్సై కె. నీలకంఠం, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, వైద్యాధికారి శిరీష, సిబ్బందితో కలిసి బాధితులకు సేవలందించారు.

బాధితులకు ఆశ్రయం

గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వాస్పత్రిలో అగ్ని ప్రమాద బాధితులకు తహసీల్దార్ ఎన్వీరమణ ఆశ్రయం కల్పించి మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. పంచాయతీ వార్డు మెంబర్ పిల్లి సతీష్‌కుమార్ రాత్రి భోజన వసతి కల్పించారు.

బాధితులకు ఎమ్మెల్యే సాయం

అగ్నిప్రమాదం వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు సంఘటనా స్థలానికి వచ్చి బాధిత కుటుంబాలు ఒక్కొక్కరికి రూ 5,000 చొప్పున నగదు, 50 కేజీల బియ్యం, కుటుంబానికి సరిపడా బట్టలు పంపిణీ చేశారు. పూర్తిగా ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే కొత్త ఇళ్లు మంజూరు చేయిస్తానని పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం తరపున అందజేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి శ్రీరాములు, అర్యవైశ్యసంఘం జిల్లా కార్యదర్శి ఎం.విశ్వేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఈశ్వరనారాయణ, బి.సూర్యనారాయణ, ఎస్.కిరణ్ కుమార్, ఉపసర్పంచ్ కె.అరవింద్ కుమార్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు టి వెంకటప్పలనాయుడు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే అగ్ని ప్రమాద బాధితులకు అత్యవసరసహాయం కింద శ్రీ సత్యారాఅండ్ బాయిల్డ్ రైస్‌మిల్లు యాజమాన్య ప్రతినిధి పద్మరాజు(మున్నా) కుటుంబసభ్యురాలు చేతనాకుమారి రూ.35 వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.



ఆర్థికసహాయం అందిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

విద్యుత్ స్తంభంపైనుంచి జారి పడి యువకుడి మృతి



ఎర్నిబాబు మృతదేహం

కొత్తవలస: మండలంలోని మోడల్ స్కూల్ సమీపంలో గల ప్రైవేట్ లేఅవుట్‌లో విద్యుత్ స్తంభం నుంచి జారి పడి విశాఖ జిల్లా.పద్మనాభం మండలం విజయరామపురం గ్రామానికి చెందిన కండుబోయిన ఎర్నిబాబు(24)శుక్రవారం మృతి చెందాడు. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మోడల్ స్కూల్ సమీపంలో గల లేఅవుట్‌లో విద్యుత్ లైన్ వేస్తున్నారు. ఈ పనిలో భాగంగా ఎర్నిబాబు స్తంభం ఎక్కి జారి పడడంతో నుదుటికి బలమైన గాయం తగిలి తీవ్రంగా రక్తస్రావం జరిగింది. తోటి కార్మికులు హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి ఆటోలో తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి తల్లిదండ్రులు అమ్మతల్లి, అప్పలసూరి ఉన్నారు. ఆ దంపతులకు ఏకైక కుమారుడు కావడంతో కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కుమారుడి మరణంతో ఆ వృద్ధ తల్లిదండ్రుల రోదన అందరినీ కంటతడి పెట్టించింది. మృతుడు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలసూర్యారావు తెలిపారు.

చెరువులో పడి బాలుడు..

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చెరువులోపడి ముడసల గౌతమ్(3) అనే బాలుడు మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రెడ్డికంచేరు పంచాయతీ పిన్నింటిపాలెం గ్రామానికి ముడసల గురువులుకు 6 సంవత్సరాల క్రితం పోలిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహం జరిగింది. వారికి ఇద్దరు కుమారులు ప్రదీప్, గౌతమ్ ఉన్నారు. బతుకుతెరువు నిమిత్తం గురువులు భార్యాపిల్లలను తీసుకుని పోలిపల్లి గ్రామంలోని ధర్మ చెరువు సమీపంలో నివాసముంటున్న అత్తవారింటికి 4 సంవత్సరాల క్రితం వచ్చేసి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాలుడు ఆడుకునేందుకు తోటి పిల్లలతో కలిసి ధర్మ చెరువు వద్దకు వెళ్లగా కాలుజారి చెరువులో పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, పతివాడ రామకృష్ణ చెరువు వద్దకు చేరుకుని బాలుడిని బయటకు తీసి హుటాహుటిన సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం తగరపువలస ఎస్ఆర్ఐ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎస్సై కృష్ణమూర్తి పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి గురువులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



చెరువులో పడి మృతి చెందిన గౌతమ్ (ఫైల్)